# దేవుడిమీద తిరుగుబాటు

శ్రీ పిల్లలమర్రి వెంకట్రామయ్య.

నువ్వు లేవు.

నువ్వున్నావని నమ్మే నీభక్తులు, ఉంటే ఉండవచ్చు కాని నువ్వు లేవు

పూర్వపు ఋషులు వ్రాసిన పురాణాల్లోనే నీ ఆకారం 'ఇది' అని చెప్పలేక నిన్ను నిర్వికారుడన్నారు. ఉన్నానంటావా?

ఎందుకున్నావు? నువ్వు ఎవరివి? ఎట్లావచ్చావు? ఎప్పటినుండి వున్నావు? నువ్వు రాకపూర్వం ఏముండేది? ఎప్పటివరకూఉంటావు? ఎవరు రమ్మన్నారు నిన్ను? అనే ప్రశ్నలకి జవాబుచెప్పు నువ్వు ఉంటే?

నువ్వు దేవుడివేఅయితే నీకు దేవత్వం ఎలావచ్చింది? నువ్వు సృష్టికర్తవుట? సృష్టించటానికి ఏం అధికారంఉన్నదసలు? నీకుపూర్వం దేవుడెవరు? నిన్ను సృష్టించింది ఎవరు? నీఅంతట నీవే వచ్చా నంటావా? అయితే మమ్మల్ని సృష్టించటానికి నీవెందుకు? మాఅంతట మేమేవస్తాంగా,

నీవు వక కల్పితవ్యక్తివి

పూర్వం మానవులు తమకు అతీతమైన వనుకునే శక్తులు నీకు అర్పణచేసి నిన్ను సృష్టించారు, నీవు ఒకడివి ఉన్నావనేభావం కలిగించారు

ప్రపంచములో నీకన్న వాస్తవికముగా కనబడే అబద్ధపురూపం ఇంకొకటిలేదు నువ్వుఅంటూ ఒకడివిఉంటే నీ పేరుతో జరిగే అన్యాయాలను సహిస్తూ ఎందుకుంటావు?

నువ్వే సృష్టికర్తవైతే, నీచేత సృష్టింపబడిన వారినందరినీ సమానంగా ఎందుకుచూడవు?

ఒకరిని ఎక్కువగాను, ఒకరిని తక్కువగానూ, ఒకర్ని బలంగలవారినిగాను, ఒకర్ని బలహీనులుగానూ సృష్టించటం ఎందుకు?

నువ్వు లేనేలేవు!

"అండ, పిండ, బ్రహ్మాండ, నాయకుడవు" నీవే అయితే నీ సృష్టిలోనే హెచ్చుతగ్గులా? పుణ్యమనీ, పాపమనీ ఎందుకు ఏర్పరిచావు? మళ్లా పుణ్యాలను కొంతమందికీ, పాపాలను కొంత మందికీ, విభాగంచేశావా? అన్నీ చేయించేది నీవేఅంటారే! ఏం దేవుడివి? ఎందుకువచ్చిన చాకిరీ ఇదంతా?

నీవు పక్షపాతివిఅల్లే ఉన్నావు అంతేకాదు లంచగొండివి కూడా! నిన్నుతలచుకొని, నీవుఉన్నావని నమ్మేవాళ్ళకు ఉపకారమా! తల వెంట్రుకలిచ్చినంత మాత్రాన ఉబ్బితబ్బిబ్బులయ్యే నీవు మానవ మాత్రులుపెట్టే నైవేద్యాలతో తృప్తిపడే రాతిబొమ్మవు పూజారుల మాటలకు మంత్రాలకు, "దాసోహం" అనే నీవు సృష్టి కర్తవా?

నీ పేరుతో బతుకుతూ నీ పేరుతోచేసే అన్యాయాలకు అంతు ఉన్నాదా? గర్భగుళ్ళలో జరిగేఘోరాలు ఇంతంతా?

మట్టిముద్దవు! రాతిబొమ్మవు

నీపేరుతో జరిగే ఖర్చు బూడిదలోపోసిన పన్నీరు. ఎలా సహిస్తున్నావిదంతా? నీకోసం చేస్తున్నారనా? ఏఏటా, ఎన్నివేల రూపాయలు నీ ఉత్సవాలనీ నీ నిధులనీ నీ మందిరాలనీ ఖర్చు అవుతోందో చూస్తోఉంటే గుండెలు అలసిపోతున్నాయి తిరుపతి, రామేశ్వరం, భద్రాచలం, శ్రీశైలం, వగైరాక్షేత్రాల్లో జరిగే ఆగానికి అంతులేదు.

భిక్షుకవృత్తికి అలవాటుపడి,  
పనిపాటలు చేయకండా .  
దేశాభివృద్ధికి చీడపురుగులై  
'ధర్మం' పేరుతో దోచుకుని తినే సోమర్లనూ  
చెప్పటానికైనా వీల్లేని ఘోరాలుచేసే యోగులకూ  
దేవాలపు పూజార్లకీ, పండాలకీ  
ఆశ్రయమిచ్చే నీవా? దేవుడవి?  
నీ నాయకత్వాన్ని మేం వొప్పుకోం!  
నీ స్థానాన్ని కాళీచేసి తిరిగి తలచూపకండా  
వెళ్ళిపో!  
లేకపోతే ఈ తిరుగుబాటు అణచటం నీ చేతగాదు!